క్లుప్తంగా

కోవూరు ఎమ్మెల్యేకు ధన్యవాదాలు



ఎమ్మెల్యే ప్రసన్నకు ధన్యవాదాలు తెలుపుతున్న వీరి చలపతిరావు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నెల్లూరులోని నివాసంలో కోవూరు ఎమ్మెల్యే నల్లపురెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డిని డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. డీసీఎమ్మెస్ చైర్మన్‌గా మరో ఆరు నెలలు తన పదవీకాలాన్ని పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేయడంపై ఎమ్మెల్యేకు పూలమొక్కను బహూకరించి ధన్యవాదాలు తెలిపారు. ఆయన వెంట రాష్ట్ర వ్యవసాయ సలహామండలి సభ్యుడు దొడ్డంరెడ్డి నిరంజన్‌బాబురెడ్డి, ఇందుకూరుపేట కోఆపరేటివ్ బ్యాంకు చైర్మన్ శ్రీనివాసులరెడ్డి, నిడుముసలి పీఏసీఎస్ అధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి ఉన్నారు.

కంటి సమస్యలపై అప్రమత్తత అవసరం



వెంకటాచలం: కంటి సమస్యలపై విద్యార్థులకు అప్రమత్తత అవసరమని వీఎస్‌యూ వైస్ చాన్సలర్ జీఎం సుందరవల్లి సూచించారు. మండలంలోని కాకుటూరు వద్ద ఉన్న వీఎస్‌యూలో ఎల్వీ ప్రసాద్ ఐ హాస్పిటల్ సౌజన్యంతో వీఎస్‌యూ సోషల్ వర్క్ విభాగం, ఆంధ్ర విద్యార్థి సంఘం సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. దీనిని వీసీ సుందరవల్లి ప్రారంభించి, మాట్లాడారు. కంటిపరమైన సమస్యలను ఎవరూ నిర్లక్ష్యం చేయవద్దన్నారు. ముఖ్యంగా విద్యార్థులు కంటి సమస్యలను నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్‌లో చాలా ఇబ్బందులు తలెత్తుతాయన్నారు. ఎల్వీ ప్రసాద్ ఐ హాస్పిటల్ సహకారంలో ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ పి.రామచంద్రారెడ్డి, ప్రిన్సిపల్ విజయానంద్‌కుమార్‌బాబు, సోషల్ వర్క్ విభాగాధిపతి డాక్టర్ సునీత, డాక్టర్ మధుమతి, ఆంధ్ర విద్యార్థి సంఘం నేతలు తురకా ప్రసాద్, సృజన్, హైమావతి, వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం, సోషల్ వర్క్ విభాగం విద్యార్థులు పాల్గొన్నారు.

రైల్లోంచి పడిన ప్రయాణికుడు



మనుబోలు: రైల్లోంచి ప్రమాదవశాత్తూ జారిపడిన ఓ ప్రయాణికుడ్ని రైల్వే అధికారులు గుర్తించి కాపాడిన ఘటన మనుబోలు రైల్వేస్టేషన్ సమీపంలో శుక్రవారం చోటుచేసుకుంది. వివరాలు.. అసోంలోని గువహటికి చెందిన ముకేశ్వర్ కొవార్ కేరళలోని ఎర్నాకుళంలో పనిచేస్తున్నారు. ఈ క్రమంలో ఈ నెల 19న విశాఖ ఎక్స్‌ప్రెస్‌లో బయల్దేరారు. బోగి మెట్లపై కూర్చొని కునుకు తీస్తూ మనుబోలు రైల్వేస్టేషన్ సమీపంలో రైలు నుంచి జారిపడి స్పృహ కోల్పోయారు. గమనించిన రైల్వే మాస్టర్ మహంతి, పాయింట్స్‌మెన్ గజ్జల కృష్ణమోహన్ అతడ్ని పక్కకు తీసుకెళ్లి ప్రాథమిక చికిత్స చేశారు. మెరుగైన చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించి బంధువులకు సమాచారం అందించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

వెంకటాచలం: సైకిల్‌ను మోటారు బైక్ ఢీకొని ఓ యువకుడు మృతిచెందిన ఘటన వెంకటాచలం టోల్‌ప్లాజా సమీపంలో శుక్రవారం జరిగింది. పోలీసుల వివరాల మేరకు.. రామదాసుకండ్రిగ గ్రామానికి చెందిన గునిమిన వెంకటేశ్వర్లు(32) ఎలక్ట్రీషియన్ పని చేస్తున్నాడు. ఆయనకు భార్య స్రవంతి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. దంపతుల మధ్య మనస్పర్థల కారణంగా భార్య స్రవంతి రెండేళ్ల నుంచి పుట్టింట్లోనే ఉంటోంది. వెంకటేశ్వర్లు పనినిమిత్తం మోటారు బైక్‌పై నెల్లూరుకు వెళ్తుండగా టోల్‌ప్లాజా సమీపంలో ఎదురుగా వచ్చిన సైకిల్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో వెంకటేశ్వర్లు రోడ్డుపై పడి తలకు తీవ్రగాయమై అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. వెంటనే ప్రయాణికులు చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడని వైద్యులు నిర్ధారించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మోటార్‌బైక్‌ల ఢీ

- ముగ్గురు యువకులకు గాయాలు

మనుబోలు : రెండు మోటార్ బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులకు గాయాలైన ఘటన మండలంలోని వీరంపల్లి ఫ్లైఓవర్ వద్ద శుక్రవారం జరిగింది. వెంకటాచలం మండలం ఇడిమేపల్లి గ్రామానికి చెందిన వెంకటేష్ బైక్‌పై ఫ్లైఓవర్‌పై వస్తుండగా మనుబోలు మండలం బండేపల్లి గ్రామానికి చెందిన రాజేష్, ప్రవీణ్ బైక్‌పై మనుబోలుకు వస్తున్నారు. ఈ రెండు బైక్‌లు ఫ్లైఓవర్ వద్ద ఎదురెదురుగా ఢీకొనడంతో ముగ్గురికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో చికిత్స నిమిత్తం గూడూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరికలు శుభపరిణామం

- నగర ఎమ్మెల్యే పీ అనిల్‌కుమార్



పార్టీలో చేరిన వారితో నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నగర నియోజకవర్గంలో టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి చేరికలు శుభపరిణామమని నగర ఎమ్మెల్యే పీ అనిల్‌కుమార్ పేర్కొన్నారు. నగరంలోని 4వ డివిజన్ జాకీర్‌హుస్సేన్‌నగర్ వాటర్‌ట్యాంక్ వద్ద శుక్రవారం జరిగిన సభలో టీడీపీ నగర మైనార్టీ ఉపాధ్యక్షుడు సయ్యద్ సందాని తన మిత్రబృందం 200 మందితో ఎమ్మెల్యే అనిల్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి ఎమ్మెల్యే పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమ పాలనకు ఆకర్షితులై టీడీపీ నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్‌సీపీలో చేరడం సంతోషకరమని పేర్కొన్నారు. 42వ డివిజన్‌లో అబ్దుల్‌మస్తాన్‌తో ప్రారంభమైన చేరికలు కొనసాగుతుండడం సంతోషకరమన్నారు. విద్యాసంస్థల అధినేత, వేలకోట్లకు పడగలెత్తిన వ్యక్తి 2019లో తనపై పోటీచేశాడని, 75వేలకు పైగా ఓట్లతో నగర ప్రజలు మద్దతు తెలిపితే నాలుగేళ్ల పాటు ఎవరికీ కనిపించలేదన్నారు. కరోనా సమయంలో ఒక్క కుటుంబానికి కూడా సాయం చేయలేదని విమర్శించారు. నారాయణ విద్యాసంస్థల్లో పేద పిల్లలకు ఒక్క రూపాయి కూడా తగ్గించలేదన్నారు. ఒక్కో డివిజన్‌లో కనీసం 20 మంది పేర్లు అయినా ఆయనకు తెలుసా? అని ప్రశ్నించారు. తాను కార్పొరేటర్‌గా గెలిచినప్పటి నుంచి ఇప్పటి వరకు తన గెలుపులో సింహభాగం ముస్లిం సోదరులే ఉన్నారన్నారు. ప్రజల ఆశీస్సులతో తాను మరో దఫా ఎమ్మెల్యే అయిన తరువాత భగత్‌సింగ్‌కాలనీలో పెన్నా ఒడ్డున నిర్మిస్తున్న విధంగానే జాకీర్ హుస్సేన్‌నగర్ నుంచి హైవే వరకు రిటైనింగ్ వాల్ నిర్మిస్తామని హామీ ఇచ్చారు. పార్టీలో చేరిన వారిలో షాహిద్, మహమ్మద్, జియాఉల్లా, బాబా, ఖాదర్‌బాషా, రబ్బాని, షాహిద్, నయాబ్, మస్తాన్, తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ఎండీ ఖలీల్‌అహ్మద్, కార్పొరేటర్లు లక్ష్మీప్రత్యూష, ఓబిలి రవిచంద్ర, సంక్రాంతి అశ్విని, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మర్యాదపూర్వకంగా..



సీఎంకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎంపీ వేమిరెడ్డి, మంత్రి కాకాణి, రూప్‌కుమార్, కొడవలూరు

నెల్లూరు (దర్గామిట్ట): తిరుపతి జిల్లా వెంకటగిరికి శుక్రవారం ఐదో విడత వైఎస్సార్ నేతన్న నేస్తం కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు వచ్చిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని జిల్లాకు చెందిన పలువురు ప్రముఖులు మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. సీఎంను కలిసిన వారిలో మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, నగర డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్, కొడవలూరు ధనుంజయరెడ్డి ఉన్నారు.

కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని వినతి



జేసీకు వినతిపత్రం అందజేస్తున్న ఉద్యోగులు

నెల్లూరు(దర్గామిట్ట): రాష్ట్ర వైద్యారోగ్యశాఖలో క్షయ నివారణ విభాగంలో పనిచేస్తున్న ఒప్పంద ఉద్యోగులను క్రమబద్ధీకరించి వారి కుటుంబాలకు న్యాయం చేయాలని ఏపీ టీబీ నివారణ విభాగం కాంట్రాక్ట్ ఉద్యోగుల సంఘ జిల్లా అధ్యక్షుడు నరేంద్రబాబు, గౌరవాధ్యక్షుడు శీనయ్య కోరారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ రోణంకి కూర్మనాథ్‌ను శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర సంఘం పిలుపు మేరకు అన్ని జిల్లా కేంద్రాల్లో వినతిపత్రాలు అందజేస్తున్నామని తెలిపారు. కోవిడ్ సమయంలో కాంట్రాక్ట్ ఉద్యోగులు చేసిన సేవలను గుర్తించి క్రమబద్ధీకరించాలని విజ్ఞప్తి చేశారు. నాయకులు చల్లా సుధాకర్, నరసింహులు, శివప్రసాద్, రాజేంద్రప్రసాద్, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

మణిపూర్ అమానుష ఘటనపై ఖండన

నెల్లూరు(బారకాసు): మణిపూర్ రాష్ట్రంలో ఇద్దరు మహిళలను వివస్త్రలను చేసి ఊరేగించడమే కాకుండా మానభంగం చేయడం హేయమైన చర్యని ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్ ప్రతినిధులు సుందరబాబు, ప్రసాద్, మహిళా సంఘ కన్వీనర్ గాయత్రి, ఉపకన్వీనర్ భార్గవి శుక్రవారం ఒక ప్రకటనలో ఖండించారు. దాదాపు మూడు నెలలుగా మణిపూర్‌లో చెలరేగుతున్న విద్వేషాలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహించకుండా తగిన చర్యలు తీసుకొని ఉంటే ఇలాంటి ఆకృత్యాలు జరిగి ఉండేవి కావన్నారు. మహిళలపై దుశ్చర్యకు పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

స్కానింగ్ సెంటర్లలో తనిఖీలు



స్కానింగ్ సెంటర్‌లో రికార్డులను పరిశీలిస్తున్న అధికారులు

నెల్లూరు(బారకాసు): నగరంలోని పొగతోటలోని పలు స్కానింగ్ సెంటర్లలో పీసీఅండ్‌పీఎన్‌డీటీ ప్రోగ్రాం అధికారులు శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. స్కానింగ్ కేంద్రాల్లో రికార్డులను సక్రమంగా నిర్వహిస్తున్నారా..లేదా అని పరిశీలించారు. ఈ సందర్భంగా డెమో శ్రీనివాసులు మాట్లాడుతూ స్కానింగ్ సెంటర్లలో ఎట్టి పరిస్థితుల్లో లింగనిర్ధారణ పరీక్షలు నిర్వహించకూడదని తెలిపారు. ఎవరైనా చేసినట్లు తెలిస్తే పీసీఅండ్ పీఎన్‌డీటీ యాక్ట్ ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. స్కానింగ్ కేంద్రాల్లో రిసెప్షన్ వద్ద ప్రజల అవగాహన కోసం ధరల పట్టికతో పాటు ఇచ్చట లింగనిర్ధారణ పరీక్షలు చేయబడవు అనే బోర్డులను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ తనిఖీల్లో డిప్యూటీ డెమో కనకరత్నం పాల్గొన్నారు.

కేపీసీ ప్రిన్సిపల్‌గా శ్రీనివాసులరెడ్డి



నెల్లూరు (టౌన్): కేపీసీ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్‌గా సీహెచ్ శ్రీనివాసులరెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. పొదలకూరులోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపల్‌గా పనిచేస్తున్న ఆయన బదిలీపై ఇక్కడకు వచ్చారు. తొలుత కేపీసీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అధ్యాపకుడిగా, ఇన్‌చార్జి ప్రిన్సిపల్‌గా పనిచేశారు. ఇంటర్‌బోర్డు పబ్లిక్ పరీక్షల నిర్వహణ కమిటీలో డీఈసీ మెంబరుగానూ పనిచేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ శ్రీనివాసులరెడ్డిని అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, ఎన్‌సీసీ ప్రోగ్రాం అధికారులు మునిరాజ, పులి చెంచయ్య శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.

ఫీజుల దోపిడీని అరికట్టాలి



ఆర్ఐఓ కార్యాలయం ఎదుట ఆందోళన చేపడుతున్న ఏబీవీపీ నాయకులు

నెల్లూరు (టౌన్) ప్రైవేట్ జూనియర్ కళాశాలల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలని ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రాజశేఖర్ డిమాండ్ చేశారు. స్టోన్‌హౌస్‌పేటలోని ఆర్ఐఓ కార్యాలయం ఎదుట ఏబీవీపీ ఆధ్వర్యంలో శుక్రవారం ఆందోళన చేపట్టారు. అనంతరం ఆర్ఐఓ శ్రీనివాసులుకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల హరనాథపురంలోని నారాయణ జూనియర్ కళాశాలలో ఆర్ఐఓ శ్రీనివాసులు పుస్తకాల గదిని సీజ్ చేశారని చెప్పారు. చైతన్య, నారాయణ కళాశాలలు కలిసి ఐఐటీ, జేఈఈ, మెయిన్స్, నీట్, ఎంసెట్ పేరుతో అధిక మొత్తంలో ఫీజులు వసూలు చేస్తున్నాయని ఆరోపించారు. ఒక పేరుతో అనుమతులు తీసుకుని మరో కళాశాల పేరుతో నిర్వహిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ జిల్లా కన్వీనర్ అశోక్‌రెడ్డి, నగర కార్యదర్శి యశ్వంత్, నాయకులు చందు, రాహుల్, బాలాజీ, నరసింహ, సాయి, తదితరులు పాల్గొన్నారు.

రేపు ఒలింపిక్‌డే రన్



నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఒలింపిక్ డే రన్‌ను ఆదివారం నిర్వహించనున్నారు. సంతోపేటలో జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు, ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి ఒలింపిక్ డే రన్ బ్రోచర్లను శుక్రవారం ఆవిష్కరించారు. ఉదయం 8 గంటలకు ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్ నుంచి ఒలింపింగ్ డే రన్ ప్రారంభమవుతుందని ఆయన తెలిపారు. చీఫ్‌కోచ్ ఆర్‌కే యతిరాజ్, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆనం మహేష్‌రెడ్డి, కార్యదర్శి కే గురుప్రసాద్, వివిధ క్రీడా సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

మిషన్ ఇంద్రధనుష్‌ను పటిష్టంగా అమలు చేయాలి



సమీక్షిస్తున్న డాక్టర్ డీజే బోరా

నెల్లూరు (బారకాసు): జిల్లాలో మిషన్ ఇంద్రధనుష్‌ను పటిష్టంగా అమలు చేయాలని వైద్యారోగ్యశాఖ రీజనల్ పరిశీలకులు డాక్టర్ డీజే బోరా సూచించారు. జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయంలో మిషన్ ఇంద్రధనుష్‌పై శుక్రవారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో రెండ్రోజుల పాటు పర్యటించి మైపాడు పీహెచ్‌సీ, కిసాన్‌నగర్ యూపీహెచ్‌సీ పరిధిలో ఇమ్యూనైజేషన్ కార్యక్రమాల అమలుతీరును పరిశీలించినట్లు తెలిపారు. డీఎంహెచ్‌ఓ ఎం పెంచలయ్య, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారిణి సెలీనాకుమారి, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ బ్రిజిత, డీపీయూసీ ఎం సతీష్, ఎన్‌సీడీ ప్రోగ్రాం ఆఫీసర్ సుధీర్, డీపీహెచ్‌ఎన్ మంజుల, తదితరులు పాల్గొన్నారు.

చిల్డ్రన్స్ పార్కు ఆధునికీకరణ పనులు వేగవంతం



చిల్డ్రన్స్‌పార్కులో ఆధునికీకరణ పనులపై సూచనలు చేస్తున్న కమిషనర్ వికాస్‌మర్మత్

నెల్లూరు(బారకాసు): నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో చిన్నపిల్లల పార్కులో చేపడుతున్న ఆధునికీకరణ పనులను వేగవంతం చేయాలని కమిషనర్ వికాస్‌మర్మత్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కమిషనర్ పార్కు ఆధునికీకరణ పనులను ఇంజినీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలతో పాటు పెద్దలు పార్కును ప్రతిరోజూ సందర్శించి ఆటవిడుపు పొందేలా అన్ని వసతులు కల్పించనున్నట్లు తెలిపారు. అభివృద్ధి పనులను ప్రణాళికాబద్ధంగా పూర్తి చేసి పార్కును త్వరలో సందర్శకులకు అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు. అనంతరం పాత మున్సిపల్ కార్యాలయంలో జరుగుతున్న నైట్‌షెల్టర్ పనులను మెప్మా పీడీ రవీంద్రతో కలిసి పరిశీలించారు. ఎస్ఈ సంపత్‌కుమార్, ఈఈ సంజయ్, డీఈఈ, ఏఈలు, సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయాలను తనిఖీ చేసిన కమిషనర్

నగర పాలక సంస్థ పరిధిలోని 22/1, 22/4 మదర్‌థెరిస్సావీధి, వేదాయపాళెం సచివాలయాలను కమిషనర్ తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి సచివాలయ సిబ్బందికి సూచనలు చేశారు. ప్రభుత్వం జగనన్న సురక్ష ద్వారా ఉచితంగా అందిస్తున్న సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. ఆయన వెంట 22వడివిజన్ కార్పొరేటర్ విజయభాస్కర్‌రెడ్డి ఉన్నారు.

క్షేత్రస్థాయిలో స్పందన ఫిర్యాదుల పరిశీలన

స్పందన వేదిక ద్వారా అందిన ఫిర్యాదుల పరిష్కారానికి కమిషనర్ వికాస్‌మర్మత్ క్షేత్రస్థాయిలో పర్యటించి పరిశీలించారు. కొత్తూరు, రామకోటయ్యనగర్, పరమేశ్వరినగర్, రెడ్‌క్రాస్ భవనం సమీపంలోని ప్రాంతాలకు సంబంధించి 'జగనన్నకు చెబుదాం', స్పందన ఫిర్యాదులను ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. ఫిర్యాదులకు శాశ్వత పరిష్కారం అందించి పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో టౌన్‌ప్లానింగ్ డీసీపీ దేవికుమారి, దశయ్య, దేవేంద్ర, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

పది విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు



నగదు ప్రోత్సాహకాలు అందుకున్న విద్యార్థులు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): వెంకటేశ్వరపురంలోని నగరపాలక సంస్థ పాఠశాలలో గత విద్యాసంవత్సరంలో పదోతరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు శుక్రవారం నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. పినాకిని లయన్స్ క్లబ్ నెల్లూరు, శుభమస్తు షాపింగ్‌మాల్ నిర్వాహకుల ఆధ్వర్యంలో పదోతరగతిలో 550కుపైగా మార్కులు సాధించిన ముగ్గురు విద్యార్థులకు రూ.5 వేలు, 500 నుంచి 550లోపు మార్కులు సాధించిన విద్యార్థులకు రూ.2 వేలు నగదు ప్రోత్సాహకాలు అందజేసి శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా పాఠశాలకు కంప్యూటర్, ప్రింటర్‌ను వితరణగా చేశారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు సునీల్‌బాబు, సురేంద్ర, అనిల్‌సాయి, శరత్‌బాబు, బయ్యా వెంకటరవి కుమార్, నెల్లూరు ఎంఈఓ అబ్దుల్‌హమీద్, హెచ్‌ఎం మంజులవాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని పలు విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో లైన్ల మరమ్మతులు చేపడుతున్న కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగునని నెల్లూరు టౌన్ ఈఈ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

- శెట్టిగుంటరోడ్డు సబ్‌స్టేషన్ పరిధిలోని డీఎస్‌నగర్, పెన్నార్ విద్యుత్ ఫీడర్ల పరిధిలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సరఫరా నిలిపివేస్తున్నారు. మూడోమైలు, కస్తూరిగార్డెన్, కిసాన్‌నగర్, జాకీర్ హుస్సేన్‌నగర్, వెంగళరెడ్డినగర్, పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదు.
- సరస్వతీనగర్ సబ్‌స్టేసన్ పరిధిలోని క్రాంతినగర్ విద్యుత్ ఫీడర్ పరిధిలో ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నారు. క్రాంతినగర్, రాజగోపాలపురం, దర్గామిట్ట పోస్టాఫీసు, పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదు.
- ఎన్టీఆర్‌నగర్ సబ్‌స్టేసన్ పరిధిలోని రామచంద్రాపురం, ఎన్టీఆర్‌నగర్ ఫీడర్ల పరిధిలో ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు సరఫరా నిలిపివేస్తున్నారు. రాయపుపాళెం, రామయచంద్రాపురం, షాదిమంజిల్, వాటర్‌ట్యాంకు, ఆర్‌కే నగర్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదు.
- హరనాథపురం సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 8.30 నుంచి 11.30 గంటల వరకు సరఫరా నిలిపివేస్తున్నారు. హరనాథపురం మెయిన్ రోడ్డు, 1 నుంచి 4వ వీధి వరకు విద్యుత్ సరఫరా ఉండదు.
- బీవీనగర్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 8 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నారు. మాగుంటలేఅవుట్, కింగ్స్‌కోర్టు, లెక్చరర్స్‌కాలనీ, డీమార్ట్, వనంతోపు, పెద్దబావిసెంటర్, ఉమ్మారెడ్డిగుంట, రామకృష్ణనగర్ పరిసర ప్రాంతాల్లో సరఫరా ఉండదు.

ఒడిశా యువకుడి ఆత్మహత్య

నెల్లూరు రూరల్: రూరల్ పరిధిలోని నరుకూరు సెంటర్‌లోని ఓ ఐస్‌ఫ్యాక్టరీ సమీపంలోని ఖాళీ స్థలంలో ఒడిశాకు చెందిన ఓ యువకుడు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. రూరల్ పోలీసుల వివరాల మేరకు.. ఒడిశా రాష్ట్రం రాయఘడ్‌కు చెందిన శాంతాశర్మ (19) అవివాహితుడు. తతంలో జీవనోపాధి నిమిత్తం నెల్లూరు వచ్చాడు. నరుకూరు సెంటర్‌లోని ఐస్ ఫ్యాక్టరీలో పనిచేశాడు. అప్పట్లో కుటుంబ కలహాలతో స్వగ్రామానికి వెళ్లాడు. ఇటీవల మళ్లీ ఐస్ ఫ్యాక్టరీలో చేరేందుకు నెల్లూరు వచ్చాడు. ఈ క్రమంలో ఫ్యాక్టరీ సమీపంలోని ఖాళీ స్థలంలోని చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికుల సమాచారంతో రూరల్ పోలీసులు మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం నెల్లూరు ప్రభుత్వ వైద్యశాలలోని మార్చురీకి తరలించారు. యువకుడి మృతిపై పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనపై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు. మృతుడి కుటుంబసభ్యులు రాయఘడ్ ప్రాంతంలో ఉన్నారని పోలీసులకు సమాచారం తెలిసింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు అనంతరం మృతిపై కేసు దర్యాప్తు చేయనున్నట్లు పోలీసులు తెలిపారు.

తూకాల్లో తేడాలొస్తే కఠిన చర్యలు

మనుబోలు : కొలతల తూకాల్లో తేడాలొస్తే కఠిన చర్యలు తప్పవని తూనికలు కొలతల శాఖ ఇన్‌స్పెక్టర్ సాయి శ్రీకర్ హెచ్చరించారు. మనుబోలు మండల కేంద్రంలోని పలు దుకాణాలను శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. తూనికల కొలతల పరికరాలను పరిశీలించారు. ప్రతి దుకాణదారుడు వారి తూనికల కొలతల పరికరాలను ఆ శాఖ వద్ద సమర్పించి నిబంధనలకు అనుగుణంగా వాటిని సరిచేయించుకుని ముద్రలు వేయించుకోవాలన్నారు. పరికరాలపై తమ శాఖ ముద్రలు లేకుండా వినియోగిస్తే జరిమానా తప్పదన్నారు. కాగా వీరి తనిఖీలను ముందే పసిగట్టిన పలువురు తమ దుకాణాలకు మూసివేశారు.

ఆశాకార్యకర్తలకు శిక్షణ



నెల్లూరు(బారకాసు): జిల్లా వైద్యారోగ్యశాఖలో కొత్తగా నియమితులైన 84 మంది ఆశా కార్యకర్తలకు గాంధీనగర్‌లోని మహిళా ప్రాంగణంలో వివిధ అంశాలపై శిక్షణ ఇస్తున్నారు. అందులో భాగంగా శుక్రవారం ప్రాథమికచికిత్స, రికార్డుల నిర్వహణ, తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి ఆదేశాల మేరకు డీఐఓ విభాగం ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ శిక్షణా కార్యక్రమంలో డీఐఓ డాక్టర్ సెలీనాకుమారి, టీఓటీలు మంజుల, సునీత, జ్యోతి, సక్కుభాయి, సుశీలమ్మ, కిష్టమ్మ, విమలకుమారి, సలోమి పాల్గొంటున్నారు.

'నారాయణ'లో ఐఐటీ సక్సెస్ మీట్



నెల్లూరు (టౌన్): చింతారెడ్డిపాళెంలోని నారాయణ మెడికల్ కళాశాల ఆడిటోరియంలో ఐఐటీ సక్సెస్ మీట్- 2023ను శుక్రవారం నిర్వహించారు. ఐఐటీ మెయిన్స్‌లో 300కు 300 మార్కులు సాధించి జాతీయస్థాయిలో ద్వితీయ ర్యాంకు సాధించిన పీ లోహిత్ ఆదిత్యసాయిని నారాయణ విద్యాసంస్థల డైరెక్టర్ సింధూర సత్కరించారు. రూ.5 లక్షల చెక్కును ప్రోత్సాహకంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఐఐటీల్లో 53 మంది, ఎన్ఐటీల్లో 153 మంది, బిట్స్‌పిలానీ, ట్రిపుల్ ఐటీ, జీఎఫ్‌టీ వంటి సంస్థల్లో 53 మందికి పైగా నారాయణ విద్యార్థులు ప్రవేశాలు పొందారని వివరించారు. నారాయణ మెడికల్ అకాడమికి చెందిన నీట్‌లో జాతీయ స్థాయిలో సాహితి 690 మార్కులు సాధించారని తెలిపారు. దాదాపు 280 మందికి పైగా విద్యార్థులు మెడికల్ సీట్లు సాధించే అవకాశం ఉందన్నారు. నారాయణ విద్యాసంస్థల జనరల్ మేనేజర్ విజయభాస్కరరెడ్డి, కోర్ డీన్ జయకుమార్ రాయుడు, డీజీఎం మధుసూదన్‌రెడ్డి, మహేష్, డీన్‌లు, ఏజీఎంలు, ప్రిన్సిపల్స్ పాల్గొన్నారు.